




ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 167 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/- బుధవారం 22 జనవరి 2025

RNI No: APTEL/2023/87888 Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


## తెలంగాణలో భారీ పెట్టుబడికి ముందుకొచ్చిన 'కంట్రోల్ ఎస్'


**తెలంగాణలో భారీ పెట్టుబడికి మరో కంపెనీ ఎంవోయూ కుదుర్చుకుంది.**



**దావోస్, జనవరి 22, (రిపబ్లిక్ న్యూస్):** తెలంగాణలో భారీ పెట్టుబడికి మరో కంపెనీ ఎంవోయూ కుదుర్చుకుంది. హైదరాబాద్లో రూ.10 వేల కోట్ల పెట్టుబడితో 400 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు 'కంట్రోల్ ఎస్' కంపెనీ అంగీకారం తెలిపింది. దీంతో 3,600 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి. తెలంగాణ మంత్రి శ్రీధరాబాబు, 'కంట్రోల్ ఎస్' సీఈవో శ్రీధర్ సమక్షంలో ఈ ఒప్పందాలు జరిగాయి. ఈ డేటా సెంటర్ రాష్ట్రంలో మరో మైలురాయి కానుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

# ఆప్ మోసాలకు 'శీష్ మహల్' ఓ ఉదాహరణ: ప్రధాని మోదీ

**దిల్లీలో ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రధాని మోదీ ఆప్పై తీవ్ర విమర్శలు చేశారు.**



**దిల్లీ, జనవరి 22, (రిపబ్లిక్ న్యూస్):** దేశ రాజధాని దిల్లీలో అసెంబ్లీ ఎన్నికలకు సమయం సమీపిస్తోంది. ఈ నేపథ్యంలోనే భాజపా ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "దిల్లీలో ఆప్కు ఓటమి తప్పదు. అది తెలిసే రోజుకో హామీ ఇస్తోంది. ఆ పార్టీ గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైంది.

ఎన్నికల సమయం దగ్గర పడుతున్న కొద్దీ ఆప్, భాజపా మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. దీంతో దిల్లీ రాజకీయా వాతావరణం వేడెక్కింది. దిల్లీ ప్రజలు అనేక సమస్యలతో బాధపడుతుంటే కేజీవాల్ తన కోసం 'శీష్ మహల్' (అద్దాల మేడ) నిర్మించుకున్నారని కొద్ది రోజులుగా భాజపా ఆరోపిస్తున్న విషయం తెలిసిందే.

దీనిపై అధికార పార్టీని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆప్ మోసాలకు శీష్ మహల్ ఒక ఉదాహరణ. ఢిల్లీ ఎన్నికల్లో కార్యకర్తల వల్లే భాజపాకు విజయం దక్కుతుంది. ప్రతి పోలింగ్ కేంద్రంలో 50 శాతం ఓట్లు భాజపాకే పడేలా కార్యకర్తలు ప్రచారం నిర్వహించాలి" అని ప్రధాని మోదీ సూచించారు.

## కుంభమేళాలో మహా ప్రసాదం వడ్డించిన సుధామూర్తి

కుంభమేళాలోని ఇస్కాన్ కిచెనన్ను సందర్శించిన ఎంపీ సుధామూర్తి.. అక్కడి భక్తులకు స్వ-యంగా మహా ప్రసాదాన్ని వడ్డించారు.

**ప్రయాగ్రాజ్, జనవరి 22, (రిపబ్లిక్ న్యూస్):** ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళాను సందర్శించుకున్నారు. ప్రముఖ వితరణశీలి, రాజ్యసభ ఎంపీ సుధామూర్తి. మూడు రోజుల పర్యటన నిమిత్తం సోమవారం ప్రయాగ్రాజ్ చేరుకున్న ఆమె.. పవిత్ర త్రివేణి సంగమంలో పుణ్యస్నానం ఆచరించారు. బుధవారం స్థానిక ఇస్కాన్ క్యాంప్ను సందర్శించి భక్తులకు స్వయంగా మహా ప్రసాదాన్ని వడ్డించారు.



తొలుత ఇస్కాన్ కిచెన్కు వెళ్లిన ఎంపీ అక్కడి వాలంటీర్లతో కొంతసేపు ముచ్చటించారు. మెషిన్లతో భోజన తయారీని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కౌంటర్ వద్ద నిలబడి కుంభమేళాకు వచ్చిన భక్తులకు చపాతీ, భోజనం వడ్డించారు. ఈ మహా కుంభమేళాను ఆమె 'తీర్థరాజ్ అభివర్ణించారు. తన పూర్వీకులకు తర్పణం వదిలేందుకు ఇక్కడకు వచ్చానని చెపా-ర్రు. మహాకుంభ మేళాలో ప్రముఖ ఆధ్యాత్మిక సేవా సంస్థ 'ఇస్కాన్', అదానీ గ్రూప్తో కలిసి నిత్యం లక్షమంది భక్తులకు భోజనాలు సమకూరుస్తోంది. తమ శిబిరాల్లో ఈ భోజనాలు వండి ప్రయాగ్లోని కేంద్రాలకు చేరవేస్తోంది. ఆహారం పంపిణీకి అదానీ గ్రూప్ వంద వాహనాలు, వాలంటీర్లను సమకూర్చింది. దీంతో పాటు గీతా ప్రెస్తో కలిసి కుంభమేళాకు వచ్చిన భక్తులకు 'ఆర్తి సంగ్రహ' పుస్తకాలను ఉచితంగా (కోటి కాపీలు) అందిస్తోంది. మంగళవారం అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ కూడా తన కుటుంబంతో కలిసి ఇస్కాన్ శిబిరాన్ని సందర్శించిన సంగతి తెలిసిందే. ఇక్కడ భోజన తయారీలో వారు పాలుపంచుకున్నారు. యా-త్రికులకు స్వయంగా వడ్డించారు.

## అమరావతి నిర్మాణం.. రూ.11 వేల కోట్ల విడుదలకు హడ్కో నిర్ణయం

రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.11 వేల కోట్లు విడుదల చేసేందుకు హడ్కో నిర్ణయం తీసుకుందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ వెల్లడించారు.



**అమరావతి, జనవరి 22, (రిపబ్లిక్ న్యూస్):** రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.11 వేల కోట్లు విడుదల చేసేందుకు హడ్కో నిర్ణయం తీసుకుందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ వెల్లడించారు. ముంబయిలో జరిగిన సమావేశంలో నిధుల విడుదలకు హడ్కో బోర్డు అనుమతి లభించిందని మంత్రి చెప్పారు. అమరావతి నిర్మాణం కోసం హడ్కో ద్వారా రూ. 11 వేల కోట్ల రుణం కోసం సంప్రదింపులు జరిపామని తెలిపారు. నిధుల విడుదలకు హడ్కో నిర్ణయం తీసుకోవడంతో రాజధాని పనులు వేగవంతం అవుతాయన్న ఆశాభావం వ్యక్తం చేశా-రు.

## జిల్లా పోలీసు అధికారులతో రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమల రావు సమీక్ష

**నేరాల నియంత్రణలో జిల్లా పోలీసుల పనితీరును అభినందించిన డిజిపి**

**ముమ్ముందు మరింత స్ఫూర్తితో పనిచేయండి**

**జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితిని డీజీపీకి వివరించిన ఎస్పీ**

**నంద్యాల క్రైం, జనవరి 22, (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్ర డీజీపీ శ్రీ ద్వారకా తిరుమలరావు జిల్లా పోలీస్ కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో నేరాల పరిస్థితిపై బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా డీజీపీ ద్వారకా తిరుమలరావు నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయానికి రాగానే కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.




అనంతరం జిల్లా సాయుధ బలగాలనుండి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం సమీక్షా సమావేశంలో ముందుగా జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా నంద్యాల జిల్లాలో నేరాల నియంత్రణకు తీసుకున్న చర్యల గురించి డీజీపీకి వివరించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ వివిధ రకాల నేరాల నియంత్రణలో పోలీసు అధికారులు తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయని,నేరాల నియంత్ర-ణలో పోలీసు అధికారులు వారి సిబ్బంది కృషి అభినందనీయమని ప్రశంసించారు. రాష్ట్ర వ్యాప్తంగా కూడా నేరాల సంఖ్య తగ్గిందన్నారు. ప్రస్తుతం నేరాలు అదుపులో ఉ న్నాయన్నారు.ముఖ్యంగా పోలీస్ అధికారులు, సిబ్బంది సైబర్ నేరాలు, ముఖ్యమైన కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానం ఉ పయోగించాలని, నేరాల నియంత్రణకు ఎప్పటికప్పుడు పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు.నిబద్ధతగా పనిచేసి జిల్లాలో శాంతిభద్రతలను పరిరక్షించాలని ఆదేశించారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు ఆసాంఘిక శక్తులను అడ్డుకునేందుకు టెక్నాలజీని ఉ పయోగించుకోవాలనే ఉద్దేశంతో డ్రోన్స్, సీసీ కెమెరాలు వాడుతున్నామన్నారు. నేరాలు జరిగే ప్రదేశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వలన నేరస్తులను కనుగొనడం జరుగుతుందని, జిల్లాలో ఫింగర్ ప్రింట్ యూనిట్ బలోపేతం చేయడం ద్వారా వివిధ రకాల కేసులలో నేర-స్తులను కనుగొని కేసులను ఛేదించడం జరిగిందని తెలియజేశారు. క్రైమ్ డిటెక్షన్ లో సిసి ఫుటేజ్ ఆధారాలు చాలా కీలకపాత్ర పోషిస్తాయని, వీటి కోసం రాష్ట్రంలో 18 వేల సిసి కేమరాలను ఏర్పాటు చేశామన్నారు. రాబోయే రోజుల్లో ఇంకా లక్ష కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, నంద్యాల ఎస్.డి.పి.ఓ. మంద జావళి ఆల్ఫోన్స్, డీఎస్పీలు రవికుమార్,శ్రీనివాస్ జిల్లా ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.



## విశాఖ, తిరుపతిలో డేటా సెంటర్లు ఏర్పాటు చేయండి :రవి లాంబాను కోరిన లోకేశ్

దావోస్ పర్యటనలో భాగంగా టెమాసెక్ హోల్డింగ్స్ భారత్ హెడ్ రవి లాంబాతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు.




దావోస్ పర్యటనలో భాగంగా టెమాసెక్ హోల్డింగ్స్ భారత్ హెడ్ రవి లాంబాతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్లో టెమాసెక్ గ్రూప్ అనుబంధ సంస్థ క్యాపిటా ల్యాండ్ ద్వారా పారిశ్రామిక పార్కులు, డేటా సెంటర్లలో పెట్టుబడులు పెట్టాలని కోరారు. విశాఖ, తిరుపతిలో కమర్షియల్ స్పేస్ ఏర్పాటు చేయడంతో పాటు, పారిశ్రామిక క్లస్టర్లలో ఆర్ఆఐటీ విధానంలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. సెంబ్ కార్ప్ కలిసి రెన్యువబుల్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని కోరారు. విశాఖ, తిరుపతిలో సెమాటెక్ టెలీమీడియా ద్వారా డేటా సెంటర్లు, డేటా సెంటర్ పార్కుల ఏర్పాటుకు సహకరించాలన్నారు. పవర్ ట్రాన్స్ మిషన్ను బలోపేతం చేయడం, గ్రిడ్ స్థిరత్వాన్ని మెరుగుపర్చడం, బ్యాకప్ కోసం సెంబ్ కార్ప్ ఇండియా ద్వారా పెట్టుబడులు పెట్టాలని మంత్రి నారా లోకేశ్ కోరారు. 2028 నాటికి క్యాపిటా ల్యాండ్ ద్వారా భారత రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులను రెట్టింపు చేయాలని అనుకుంటున్నట్లు రవి లాంబా వెల్లడించారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై సహచరులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. ట్రాఫిక్ జామ్ కారణంగా కాంగ్రెస్ సెంటర్ లో భేటీకి మంత్రి లోకేశ్ కాలినడకన వెళ్లారు.

### గ్లోబల్ టాలెంట్ హబ్గా ఏపీని తీర్చిదిద్దాలనేదే లక్ష్యం: లోకేశ్

పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నవీన ఆవిష్కరణలు జరగాలని మంత్రి లోకేశ్ అన్నారు. దావోస్లో విద్యారంగ గవర్నర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. "ఏఐ శిక్షణకు మద్దతు, శిక్షణ పొందిన వర్క్ ఫోర్సు రూపొందించడానికి, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు 3 ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలె-న్స్ను స్థాపించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం 2024-25 మధ్యంతర బడ్జెట్లో రూ.255 కోట్లు కేటాయించాం. పోటీతత్వాన్ని పెంచేందుకు స్టెమ్, ఏఐ విద్యపై దృష్టి సారించాం. 2047 నాటికి 95 శాతం నైపుణ్యం కలిగిన శ్రామికశక్తిని తయారు చేయాలని ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా పెట్టుకుంది. విస్తృత ఉపాధి కల్పన, సౌకర్యవంతమైన వర్క్ఫోర్స్ మోడల్తో నిరంతర అప్స్కిల్లింగ్ కార్యక్రమాలు ఏర్పాటు చేసి రాష్ట్రాన్ని గ్లోబల్ టాలెంట్ హబ్ తీర్చిదిద్దాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం" అని లోకేశ్ వివరించారు.

## తిరుపతి తొక్కిసలాట ఘటన.. న్యాయవిచారణకు ప్రభుత్వం ఆదేశం

**తిరుపతి తొక్కిసలాట ఘటనపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం న్యాయ విచారణకు ఆదేశించింది.**



**అమరావతి, జనవరి 22, (రిపబ్లిక్ న్యూస్):** తిరుపతి తొక్కిసలాట ఘటనపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం న్యాయ విచారణకు ఆదేశించింది. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సత్యనారాయణమూర్తి నేతృత్వంలో జ్యుడిషియల్ విచారణకు ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఘటనపై ఆరు నెలల్లో నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఉత్త-ర్వుల్లో పేర్కొంది. జనవరి 8న తిరుపతిలోని వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల పంపిణీ కేంద్రాల వద్ద జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మృతి చెందగా.. పలువురు భక్తులు గాయపడిన విషయం తెలిసిందే. ఈ ఘటనను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా పరిగణించారు. ఘటన జరిగిన ప్రాంతాలను పరిశీలించారు. ఘటన జరిగిన తీరుపై ఆరా తీసిన సీఎం చంద్రబాబు.. న్యాయ విచారణకు ఆదేశిస్తామని ప్రకటించారు. ఈ మేరకు తాజాగా జ్యుడిషియల్ విచారణకు ఆదేశిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# వీల్ ఛైర్‌లో రష్మిక.. వీడియో వైరల్

నటి రష్మిక వీల్ ఛైర్‌లోకనిపించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.



స్టార్ హీరోయిన్ రష్మిక ఇటీవల గాయపడిన విషయం తెలిసిందే. జిమ్ వర్కౌట్లు చేస్తుండగా ఆమె కాలికి గాయమైంది. తాజాగా ఆమె హైదరాబాద్ విమానాశ్రయంలో వీల్చైర్లో కనిపించారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తన హిందీ చిత్రం ప్రచారంలో పాల్గొనడం కోసం ముంబయి బయల్దేరినట్లు తెలుస్తోంది. కారులో ఎయిర్పోర్ట్కు చేరుకున్న రష్మిక తన టీమ్ సాయంతో వీల్చైర్లో విమానాశ్రయం లోపలికి వెళ్లారు. ఈ వీడియో చూసిన అభిమానులు ఆమె త్వరగా కోలుకోవాలంటూ కామెంట్స్ చేస్తున్నారు. తనకు గాయమైనట్లు తెలుపుతూ ఇటీవల రష్మిక ఓ పోస్ట్ పెట్టారు. "పూర్తిగా ఎప్పుడు కోలుకుంటానో ఆ భగవంతుడికే తెలియాలి. త్వరగా కోలుకుని 'సికందర్, 'థామ', 'కుబేర సెట్స్లో పాల్గొనాలని ఆశిస్తున్నా. ఈ ఆలస్యాన్ని క్షమించాలని ఆయా చిత్రాల దర్శకులను కోరుతున్నా. నా కాలు ఏమాత్రం సెట్ అయినా వెంటనే షూట్లో భాగం అవుతా" అని దానిలో తెలిపారు. ప్రస్తుతం రష్మిక 'ఛావా'తో బిజీగా ఉన్నారు. ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. విక్కీ కౌశల్ హీరోగా లక్ష్మణ్ ఉటేకర్ తెరకెక్కించిన హిస్టారికల్ యాక్షన్ ఫిల్మ్ ఇది. తెలుగులో 'కుబేర', 'ది గర్ల్ఫ్రెండ్', 'రెయిన్ బో' చిత్రాలతో అలరించనున్నారు.

## నాగశౌర్య కొత్త సినిమా.. టైటిల్ ఏమిటంటే..?

నటుడు నాగశౌర్య పుట్టినరోజు నేడు. ఈ సందర్భంగా ఆయన నటిస్తోన్న కొత్త సినిమా టైటిల్ విడుదలైంది.

నటుడు నాగశౌర్య ఇటీవల నటించిన వరుస చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మిశ్రమ స్పందనలకే పరిమితమైన విషయం తెలిసిందే. దీంతో సరైన సక్సెస్ అందుకోవడం కోసం ఎంతగానో శ్రమిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన వరుస ప్రాజెక్టులు ఓకే చేశారు. ఆయన కథానాయకుడిగా రామ్ దేసిన దర్శకత్వంలో కొత్త సినిమా తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. బుధవారం నాగశౌర్య పుట్టినరోజును పురస్కరించుకొని చిత్రబృందం టైటిల్ పోస్టర్ విడుదల చేసింది. ఈ చిత్రానికి 'బ్యాడ్ బాయ్ కార్తిక్ అనే టైటిల్ను ఖరారు చేశారు. యూత్ఫుల్, యాక్షన్ ఎంటర్టైనర్గా విభిన్నమైన కథతో దీనిని తెరకెక్కిస్తున్నారు. శౌర్య యాంగ్రీ లుక్లో కనిపించారు. వైష్ణవి ఫిల్మ్స్ పతాకంపై ఈ సినిమా నిర్మితమవుతోంది. ఈ చిత్రానికి హరీశ్ జయరాజ్ స్వరాలు అందిస్తున్నారు. మరోవైపు నాగశౌర్య హీరోగా 'పోలీసు వారి హెచ్చరిక, 'నారీ నారీ నడుమ మురారి' చిత్రాలు ఉన్నాయి.




రిపబ్లిక్ సినిమా CINEMA

## జయలలిత బయోపిక్..
### అందుకే చేయలేదు: నిత్యామేనన్

దివంగత నేత, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత జీవితాన్ని ఆధారంగా చేసుకుని గతంలో ఓ సినిమా ప్రకటించిన విషయం తెలిసిందే. నిత్యామేనన్ హీరోయిన్గా ప్రియదర్శిని దర్శకత్వంలో దీనిని ప్రకటించారు. ఈ సినిమా గురించి ఆమె తాజాగా స్పందించారు.



దివంగత నేత, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత జీవితాన్ని ఆధారంగా చేసుకుని ఇప్పటికే సినిమా, వెబ్ సిరీస్లు విడుదలై ప్రేక్షకులను అలరించాయి. నిత్యామేనన్ కథానాయికగా ప్రియదర్శిని అనే యువ దర్శకురాలు జయలలిత బయోపిక్ చేస్తున్నట్లు 2019లో ప్రకటించారు. 'ది ఐరన్ లేడీ' అంటూ టైటిల్ పోస్టర్ కూడా విడుదల చేశారు. ఈ సినిమా గురించి తాజాగా నిత్యామేనన్ స్పందించారు. సినిమా ప్రకటించి సుమారు ఐదేళ్లు దాటుతున్నా ఎటువంటి అప్డేట్ లేకపోవడంపై ఆమె మాట్లాడారు. "జయలలిత బయోపిక్ చేయాలని మేము ఎంతగానో ఆశపడ్డాం. చర్చలు కూడా జరిగాయి. మా సినిమా ప్రకటించిన తర్వాత అదే కథతో 'తలైవి' అనే చిత్రం వచ్చింది. మళ్లీ సినిమా చేస్తే రిపీట్ అవుతుందనిపించింది. మా నాన్న మాత్రం.. తప్పకుండా ఆ సినిమాలో యాక్ట్ చేయమని కోరారు. కొంతకాలానికి 'క్వీన్' పేరిట ఒక వెబ్ సిరీస్ కూడా వచ్చింది. అలా, ఒకే కథపై రెండు ప్రాజెక్టులు విడుదలయ్యాక.. మేము సినిమా చేస్తే రిపీట్ చేసినట్లు అవుతుందని భావించా. అందుకే ఆ సినిమా పక్కన పెట్టేశా" అని చెప్పారు. ఇండస్ట్రీలో రాణించడంపై ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. "నాకు సినీరంగం అంటే ఇష్టం లేదు. ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా జీవితాన్ని ఆస్వాదించాలనేది నా కోరిక. అవకాశం వస్తే వేరే రంగానికి వెళ్లాలని కూడా ప్రయత్నించా. కానీ, జాతీయ అవార్డు నా ఆలోచనల్ని తిప్పికొట్టింది. ఉత్తమ నటిగా నాకు దక్కిన ఈ పురస్కారం నేనేంటో నిరూపించి.. నా జీవితానికి ఓ మార్గాన్ని చూపించింది" అని ఆమె అన్నారు. నిత్యామేనన్ నటించిన తాజా చిత్రం 'కాదలిక్క నేరమిల్లై'. జయంరవి ప్రధాన పాత్రలో నటించారు. జనవరి 14న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మిశ్రమ స్పందనలు సొంతం చేసుకుంది. ప్రస్తుతం ఆమె 'ఇడ్లీ కడై' కోసం వర్క్ చేస్తున్నారు. ధనుష్ స్వీయ దర్శకత్వంలో ఇది సిద్ధమవుతోంది.


## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1666: మొఘల్ చక్రవర్తి షాజహాన్ మరణం (జ.1592).
- 1882: భారత స్వాతంత్ర్య సమర యోధుడు అయ్యదేవర కాళేశ్వరరావు జననం (మ.1962).
- 1885: ఆంధ్ర పితామహ గా పేరుగాంచిన మాడపాటి హనుమంతరావు జననం (మ.1970). (చిత్రంలో)
- 1900: అమెరికా సంయుక్త రాష్ట్రాలకు చెందిన శాస్త్రవేత్త, సంగీత కారుడు డేవిడ్ ఎడ్వర్డ్ హ్యూస్ మరణం (జ.1831).
- 1901: అరవైమూడేళ్లపాటు యునైటెడ్ కింగ్‌డమ్‌ను ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలించిన విక్టోరియా మహారాణి మరణం (జ.1819).
- 1940: తెలుగులో వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి మరణం (జ.1863).
- 1965: మానవతావాది మలిశెట్టి వెంకటరమణ జననం.
- 1972: స్వామి రామానంద తీర్థ మరణం (జ.1903).
- 2014: తెలుగు సినిమా నటుడు అక్కినేని నాగేశ్వరరావు మరణం (జ.1923).


షాజహాన్


అయ్యదేవర కాళేశ్వరరావు



మాడపాటి హనుమంతరావు


డేవిడ్ ఎడ్వర్డ్ హ్యూస్


విక్టోరియా


గిడుగు రామమూర్తి


మలిశెట్టి వెంకటరమణ


స్వామి రామానంద తీర్థ


అక్కినేని నాగేశ్వరరావు

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

### గత కీర్తి ఎల్లవేళలా వెంటరాదు..
## ప్రస్తుత ఫామే కీలకం: సీనియర్ల కపిల్ దేవ్

భారత క్రికెట్లో ఇప్పుడు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి సీనియర్లు. ఇటీవల పేలవ ఫామ్తో ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.



గతంలో ఎంత సాధించినా.. క్రికెటర్లకు ప్రస్తుత ఫామే అత్యంత కీలకమంటూ భారత దిగ్గజం కపిల్ దేవ్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. రోహిత్, విరాట్ కోహ్లి వంటి సీనియర్ బ్యాటర్లు ఫామ్ కోల్పోయి ఇబ్బంది పడుతోన్న సంగతి తెలిసిందే. వీరిద్దరూ రంజీ బరిలోకి దిగబోతున్నవేళ కపిల్ ఈ వ్యాఖ్యలు చేశాడు. గత కీర్తితో ఎల్లవేళలా కొనసాగలేమని, నాణ్యమైన ఆటతీరు ప్రదర్శిస్తూనే ఉండాలని సూచించాడు. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం భారత జట్టును ఇటీవల బీసీసీఐ ప్రకటించింది. అంతకుముందు ఆసీస్తో టెస్టు సిరీస్లో రోహిత్, విరాట్ దారుణంగా విఫలమయ్యారు. సీనియర్లు ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడటంపైనా ఒకదశలో అనుమానాలు వచ్చాయి. అయితే, వారికి ఛాన్స్ దక్కింది.

**దుబాయ్‌లో వారిద్దరే కీలకం: కైఫ్**

"ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ విజయం సాధించాలంటే సీనియర్లు రోహిత్, విరాట్ కోహ్లి రాణించడం అత్యంత ముఖ్యం. వీరిద్దరూ మరింతకాలం ఆడకపోవచ్చు. ఎంత ఆడినా.. ఈ ఐసీసీ టోర్నీనే చివరిది కావొచ్చు. తమ అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించాలి. దుబాయ్లో వీరిద్దరే కీలకం. రోహిత్ శర్మ దూకుడైన ఆరంభం అందించాలి. కోహ్లి దానిని ముందుకు తీసుకెళ్లాలి. గతంలోనూ ఇలాంటి ఆటతీరును చూశాం" అని భారత మాజీ క్రికెటర్ కైఫ్ వెల్లడించాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో భారత ఆడే మ్యాచులన్నీ దుబాయ్ వేదికగానే జరుగుతాయి. ఫిబ్రవరి 23న పాకిస్థాన్‌తో టీమిండియా తలపడనుంది. ఈ గ్రూప్లో బంగ్లాదేశ్, న్యూజిలాండ్ ఇతర జట్లుగా ఉన్నాయి.

ఈ క్రమంలో సీనియర్లకు కపిల్ దేవ్ పలు సూచనలు చేశాడు. "బ్యాటింగ్ లేదా బౌలింగ్లో మరిన్ని ఆప్షన్లు ఉన్నప్పుడు ఫామ్లో ఉన్నవారితోనే ఆడాలి. ఎందుకంటే గత కీర్తి ఆధారంగా ఎక్కువకాలం కొనసాగలేం. ఇప్పుడున్న ఫామే అత్యంత కీలకం. ఎంతటి గొప్ప ప్లేయరైనా వరుసగా విఫలమవుతున్నా అవకాశాలు ఇవ్వడంలో అర్థం లేదు. ఒకవేళ కుర్రాళ్లే అలాంటి పరిస్థితుల్లో ఉంటే ఛాన్సు ఇవ్వరుగా. అదే సీనియర్ల విషయంలో ఎందుకు పాటించరు? సెలక్షన్ ప్రక్రియ ఆరోగ్యకరమైన వాతావరణంలో జరగాలి. ఫామ్లో లేని కోహ్లి స్థానంలో కుర్రాళ్లకు అవకాశం ఇవ్వాల్సింది. అయితే, ఇప్పుడు మరోసారి అతడికి ఛాన్స్ వచ్చింది. ఇప్పుడైనా 'అవును నేను ప్రపంచంలోనే నంబర్వన్ ప్లేయర్గా ఉన్నా. ఇప్పుడు ఆ స్థాయికి తగ్గట్టుగా ఆడాలి' అని అనుకోవాలి. అప్పుడు అతడితోపాటు జట్టుకూ ప్రయోజనం" అని కపిల్ వెల్లడించాడు.

**ఫ్యాషన్**

## ఏ డ్రెస్ వేసినా సన్నగా కనిపించాలా, ఇలా ఫాలో అవ్వండి చాలు

సన్నగా కనిపించాలని అందరికీ ఉంటుంది. అలా అని ఉన్నట్టుండి సన్నగా మారలేం కదా. అయితే, మనం వేసే డ్రెస్సెస్‌తోనే కాస్త సన్నగా కనపడేలా చేయొచ్చు. అదెలానో తెలుసుకోండి.

సన్నగా కనిపిస్తే అందంగా ఉంటామని చాలా మంది అనుకుంటారు. నేటికాలంలో చాలా మంది బిజీ లైఫ్‌స్టైల్ కారణంగా అనుకున్నట్లుగా ఫిట్‌గా ఉండలేకపోతున్నారు. అయినప్పటికీ బరువు తగ్గించుకునే ప్రయత్నాలు చేస్తుంటారు. ఇలాంటి టైమ్‌లో ఉన్నట్టుండి సన్నగా కనిపించలేరు. కానీ, కొన్ని టిప్స్ ఫాలో అయితే, ఎంత బరువుగా ఉన్నా సన్నగా, అందంగా కనిపిస్తారు. బరువు ఎక్కువగా ఉన్నప్పటికీ, మనం ఫాలో అయ్యే కొన్ని కొన్ని టిప్స్ కారణంగా సన్నగా, నాజుగ్గా కనిపించొచ్చు. దీనికి ఎక్కువ శ్రమపడాల్సిన అవసరం కూడా లేదండి. కొన్ని ఫ్యాషన్ టిప్స్ ఫాలో అయితే సరి. మరి ఆ టిప్స్ ఏంటో తెలుసుకోండి.



### పొడవైన నెక్లెస్‌లు




మెడలో పొడుగ్గా నెక్లెస్‌లు వేసుకోండి. ఇవి మిమ్మల్ని పొడుగ్గా కనిపించేలా చేస్తాయి. అదే విధంగా, సన్నగా కనిపించేలా చేస్తాయి. అదే విధంగా, హీల్స్ వేసుకోవడం అలవాటు చేసుకోండి. వీటి వల్ల కూడా మీ లుక్ ఎన్‌హెన్స్ అవుతుంది. అయితే, హీల్స్ కంఫర్ట్‌గా ఉన్నవే వేసుకోండి. దీంతో చూడ్డానికి ఇబ్బందిగా లేకుండా ఉంటుంది.

### లూజ్‌గా ఉండే బట్టలు వద్దు



లూజ్‌గా ఉండే బట్టలు ప్రజెంట్ ట్రెండ్ అయ్యాయని అందరూ వేసుకుంటున్నారు. కానీ, బరువుగా ఉన్నవారిని ఇలాంటి బట్టలు మరింత లావుగా కనిపించేలా చేస్తాయి. కాబట్టి, లూజ్‌గా కాకుండా మీకు సెట్ అయిన సరైన ఫిట్టింగ్ ఉండే బట్టల్ని ఎంచుకోండి. వీటితో పాటు పెద్ద పెద్ద ప్రింట్స్, వర్క్ ఉన్న వాటి బదులు ప్లెయిన్ డ్రెస్సెస్ వేసుకోండి.

### బెల్ట్ వాడడం



బెల్ట్ వాడడం వల్ల కూడా మీరు సన్నగా కనిపిస్తారు. దీని వల్ల మీ నడుము సన్నగా కనిపిస్తుంది. ఆడవారు, చీరలు, లంగావోణీలపైకి ఒడ్డాణం వంటివి ట్రై చేయొచ్చు. వీటితో మీ లుక్ మారుతుంది. సన్నగా కూడా కనిపిస్తారు. మరీ హెవీ ఒడ్డాణాలు కాకుండా సన్నవి కూడా ట్రై చేయొచ్చు. దీంతో మీ లుక్ చాలా బాగుంటుంది.

### నిలువు గీతల డ్రెస్సెస్



అడ్డంగా ఉండే గీతల డ్రెస్సెస్ మనం ఉన్నదానికంటే లావుగా ఉన్నట్లు కనిపించేలా చేస్తాయి. అలా కాకుండా నిలువు గీతలు ఉండే డ్రెస్సెస్ ట్రై చేయండి. దీంతో చూడ్డానికి కూడా చక్కగా కనిపిస్తారు. అవి కూడా మంచిగా నీట్‌గా ఐరన్ చేసినట్లుగా ఉండాలి. ముడతలుగా అసలు ఉండకూడదు.

### డార్క్ కలర్స్ వేసుకోవడం



డార్క్ కలర్స్ అంటే బ్లాక్, నేవీ బ్లూ, థిక్ గ్రీన్ వంటి కలర్ డ్రెస్సెస్ వేసుకోండి. దీని వల్ల చూడ్డానికి చక్కగా కనిపించడం మాత్రమే కాదు. అవి సన్నగా కనిపించేలా చేస్తాయి. కాబట్టి, ఇలాంటి కలర్స్‌ని ప్రిఫర్ చేయండి. వీటిని మంచి కాంబినేషన్‌తో పెయిర్ అప్ చేయండి. దీంతో చూడ్డానికి బావుంటారు. పొడుగ్గా కనిపిస్తారు.

